టీటీడీ నిర్ణయం అభినందనీయం

సనత్‌నగర్: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శ్రీవారి దర్శనార్థం తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖలను ఆమోదించేలా నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని బీఆర్‌ఎస్ పార్టీ బేగంపేట డివిజన్ అధ్యక్షుడు, యాదవ సంఘం అధ్యక్షుడు పొన్నబోయిన సురేష్‌యాదవ్ అన్నారు. బేగంపేటలోని యాదవ సంఘం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీటీడీ ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయంతో తెలంగాణ ప్రాంత భక్తుల మనోభావాలను కాపాడారన్నారు. తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు శ్రీవారి దర్శనం విషయంలో ప్రత్యేక కోటా కల్పించాలంటూ ఇటీవల కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు లేఖ రాసినట్లు తెలిపానే. దీనిపై స్పందించి ప్రజా ప్రతినిధులకు ప్రాధాన్యం కల్పిస్తూ నిర్ణయం తీసుకోవడం శుభపరిణామం అన్నారు. ఈ సందర్భంగా ఆయన టీటీడీ ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉప్పొంగిన 'నూతనోత్సాహం'

అంబరాన్నంటిన 'నయా' సంబురం..

- బేగంపేట హాకీగ్రౌండ్‌లో నూతన సంవత్సర వేడుకలు..
- హోరెత్తించిన నటి దక్ష నాగర్కర్ డ్యాన్స్



సనత్‌నగర్: న్యూ ఇయర్ సంబరాలతో సనత్‌నగర్ నియోజకవర్గ వీధులు మంగళవారం రాత్రి హోరెత్తాయి. కుర్రకారు ఆటపాటలు, కేరింతలు మిన్నంటాయి. 2024కు వీడ్కోలు పలుకుతూ 2025ను ఆహ్వానిస్తూ ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. కేకులతో కేక పుట్టించారు. అర్ధరాత్రి 12 గంటలకు న్యూ ఇయర్ జోష్ రెట్టింపయ్యింది. వీధులు 'కొత్త'శోభను సంతరించుకున్నాయి. మామూలు రోజుల్లో వినిపించే వాహనాల రణగొణ ధ్వనులకు తోడు ఒక్కసారిగా యువత బైక్‌లపై రోడ్ల పైకి వచ్చి హ్యాపీ న్యూ ఇయర్ అంటూ అరుపులు, కేకలతో సంబరాలు చేసుకున్నారు. సనత్‌నగర్, అమీర్‌పేట్, ఎస్ఆర్‌నగర్, బేగంపేట్, రాంగోపాల్‌పేట్, బన్సీలాల్‌పేట్, పద్మారావునగర్ తదితర ప్రాంతాల్లో నూతన సంవత్సర ఆనందోత్సావాలు వెల్లివిరిశాయి. పలు కాలనీల అసోసియేషన్లు, అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో కొత్త ఏడాదికి ఘన స్వాగతం పలికారు. జెకెకాలనీ, సుందర్‌నగర్, మోడల్ కాలనీల్లోని పలు అపార్ట్‌మెంట్లలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బేకరీలు, హోటళ్లలో కేక్‌ల విక్రయాలు, బిర్యానీ పార్శిల్ సేవల కోసం ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్ల వద్ద రద్దీ నెలకొంది.

కంట్రీక్లబ్ ఆధ్వర్యంలో..

బేగంపేటలోని కంట్రీక్లబ్ ఆధ్వర్యంలో రసూల్‌పురాలోని పోలీస్ హాకీగ్రౌండ్స్‌లో జరిగిన ఆసియా బిగ్గెస్ట్ న్యూ ఇయర్ బాష్ 2025 వేడుక కోలాహలంగా జరిగింది. యువతరం ఉర్రూతలూగింది. టాలీవుడ్ నేపథ్య గాయకులు జాహ్నవి బృందం ఆలపించిన పాటలు, నృత్య ప్రదర్శనలు.. ప్రఖ్యాత డీజే బబ్లు సంగీతహోరుతో యువతను హుషారెక్కించారు. టాలీవుడ్ నటి దక్ష నాగర్కర్ హిందీ, తెలుగు సినీ పాటలపై చేసిన నృత్య ప్రదర్శనలు హుషారెక్కించాయి. సంగీత హోరులో యువత డ్యాన్స్‌లు, కేరింతలతో ఉల్లాసంగా గడిపారు. కంట్రీక్లబ్ హాస్పిటాలిటీ అండ్ హాలీడేస్ సీఎండీ వై.రాజీవ్‌రెడ్డి మాట్లాడుతూ కొత్త సంవత్సరం..సరికొత్త ఆశయాలతో సాగేందుకు కంట్రీక్లబ్ ఈ ఆనందాల వేడుక జరుపుకుందన్నారు. దేశవ్యాప్తంగా హైదరాబాద్‌తో పాటు ముంబాయి, ఢిల్లీ, కోల్‌కత్తా, కొల్లాపూర్, సూరత్, బెంగుళూరు, పూణే, కేరళ నగరాల్లోని తమ కంట్రీ క్లబ్‌లు రిసార్ట్‌లలో ఆసియాలోనే అతిఎపెద్ద న్యూ ఇయర్ బాష్ 2025ని ఏర్పాటు చేశామన్నారు.

ఓలలాడించిన సంగీతం...

అమీర్‌పేట్‌లోని ఆదిత్యాపార్క్, గ్రీన్‌పార్క్, మ్యారీగోల్డ్, ఆదిత్యా హోమ్‌టెల్, సిల్వర్‌పార్క్, సితార రెసిడెన్సీ, చిరాన్‌పోర్ట్ క్లబ్, మానస సరోవర్ ది ఫెర్న్ తదితర హోటళ్లలో సంగీత కార్యక్రమాలు హోరెత్తించాయి. ఈ సందర్భంగా పలువురు సెలబ్రేటీలతో పాటు డీజేలు, యాంకర్లు తమ ప్రదర్శనతో యువతలో నూతనోత్తేజాన్ని కలిగించారు.

ఆలయాలు...చర్చిల ముస్తాబు...

న్యూ ఇయర్‌ను పురస్కరించుకుని ఆలయాలు, చర్చిలు అందంగా ముస్తాబయ్యాయి. కొత్త ఏడాది మొదటి రోజు కావడంతో భక్తుల తాకిడి అధికం కానున్న నేపథ్యంలో ఆయా ఆధ్యాత్మిక కేంద్రాల నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విద్యుద్దీపాల ధగ ధగలతో ప్రార్థనా మందిరాలు కాంతులీనాయి. కొత్త ఏడాదిని ఆహ్వానిస్తూ ఆలయ అర్చకులు, చర్చి పెద్దలు ప్రత్యేక పూజలు, ప్రార్థనలు జరిపేందుకు సిద్ధమవుతున్నారు.




బేగంపేట పోలీస్ హాకీ గ్రౌండ్‌లో న్యూఇయర్ వేడుకల్లో కుర్రకారు..

కంటోన్మెంట్ బోర్డుకు ఎన్నికలు నిర్వహించండి



కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు తక్షణమే ఎన్నికలు నిర్వహించేలా చూడాలని కంటోన్మెంట్ ప్రజాస్వామ్య పరిరక్షణ జాయింట్ యాక్షన్ కమిటీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు జేఏసీ కన్వీనర్ తేలుకుంట సతీష్ గుప్తా ఆధ్వర్యంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సాద కేశవరెడ్డి, జైప్రకాశ్‌లతో పాటు ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు జరిగి పదేళ్లు పూర్తవుతుందని ఎంపీకి విన్నవించారు. జీహెచ్ఎంసీలో విలీనం, బోర్డు చట్టంలో మార్పులు తదితర కారణాలతో కేంద్రం ఎన్నికలు నిర్వహించడం లేదని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. మూడేళ్లుగా బోర్డులో ప్రజాప్రతినిధుల ప్రాతినిథ్యం లేకపోవడంతో రాచరిక పాలన సాగుతోందన్నారు. తక్షణమే కేంద్రాన్ని ఒప్పించి బోర్డు ఎన్నికలు నిర్వహించాలని కోరారు.

వాచ్‌మెన్ చికిత్సకు ఆర్థిక సాయం

అమీర్‌పేట: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వాచ్‌మెన్ చికిత్సకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ఆర్థిక సహాయ పత్రాలను అందజేశారు. అమీర్‌పేటకు చెందిన రాజేష్ స్థానిక అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొద్ది రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రి వైద్యులను సంప్రదించాడు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు శస్త్ర చికిత్స చేయాలని సూచించారు. నిరుపేద కుటుంబానికి చెందిన రాజేష్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి ఆర్థిక పరిస్థితిని వివరించి చికిత్స కోసం సహాయం చేయాలని కోరడంతో స్పందించిన ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆపరేషన్ కోసం రూ.1.10 లక్షల ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకున్నారు. మంగళవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఆర్థిక సహాయం మంజూరు పత్రం ఎల్‌ఓసీని రాజేష్‌కు అందజేశారు. కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సంతోష్, నర్సింహ, కట్టబలరాం, సుమిత్‌సింగ్ పాల్గొన్నారు.

సీఎన్ఎంగా అవకాశం కల్పించాలి

కంటోన్మెంట్: కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ నామినేటెడ్ మెంబర్ (సీఎన్ఎం)గా తమకు అవకాశం కల్పించాలని పార్టీ పెద్దలను కోరినట్లు బోర్డు మాజీ ఉపాధ్యక్షురాలు భానుక నర్మద, ఆమె భర్త బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భానుక మల్లికార్జున్ అన్నారు. ఈ మేరకు పార్టీ నేత బాణాల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. రెండేళ్లుగా తమ పార్టీకే చెందిన వ్యక్తి సీఎన్ఎంగా కొనసాగుతున్నప్పటికీ, ప్రజలు, కార్యకర్తలను కలుపుకుని పోవడంలో ఆయన విఫలమయ్యారన్నారు. ఈ నేపథ్యంలో త్వరలో వేరేడ్ బోర్డు పొడిగింపు సందర్భంగా తమ అభ్యర్థిత్వాన్ని పరిశీలించాల్సిందిగా పార్టీ పెద్దలను కోరామన్నారు. కంటోన్మెంట్‌లో బీజేపీ బలం ఎంతో పెరిగిందన్నారు. తాము బీజేపీని వీడుతున్నట్లు వచ్చిన వార్తలు అవాస్తవం అన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్, ఉప ఎన్నికల్లో తాము ప్రాతినిథ్యం వహించిన ఆరో వార్డులోనే బీజేపీకి అధిక మెజారిటీ వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలోనే నామినేటెడ్ మెంబర్‌గా అవకాశమిస్తే పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. ఇటీవల ఢిల్లీలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ పాటు ఎంపీ ఈటల రాజేందర్, రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్, భగవత్ కరాడ్ తదితరులను కలిసి వినతి పత్రం అందజేశామన్నారు.

సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపండి

రాంగోపాల్‌పేట్: రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో నెలకొన్న సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కార్పొరేటర్ చీర సుచిత్ర జోనల్ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం ఆమె జోనల్ కమిషనర్ రవికిరణ్, డిప్యూటి కమిషనర్ సమ్మయ్యలను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో స్థానికులు తమ అవసరాల మేరకు ఇష్టారాజ్యంగా రోడ్ల తవ్వకాలు చేపట్టారని దీని వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ప్రజాధనం వృథా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. కొన్ని ప్రాంతాల్లో పెరిగిన చెట్ల కొమ్మలు వీధి దీపాలకు అడ్డుగా రావడంతో రాత్రి వేళల్లో చీకట్లు అలుముకుంటున్నాయన్నారు. పారిశుద్ధ్య కార్మికుల కొరతతో వీధుల్లో చెత్తను తొలగించలేకపోతున్నారని దీని వల్ల చెత్త, చెదారం పేరుకుని పోయి దుర్వాసన, దుర్గంధం వెదజల్లుతుందన్నారు. క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలపై అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చీర శ్రీకాంత్, మనోజ్ ఉపాధ్యాయ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణను కుదించండి

కంటోన్మెంట్: కంటోన్మెంట్ పరిధిలో చేపట్టబోయే ఎలివేటెడ్ కారిడార్‌ల కోసం రోడ్ల విస్తరణను 200 అడుగులకు బదులుగా, 120 ఫీట్‌లకు కుదించాలని రాజీవ్ రహదారి ప్రాపర్టీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు అసోసియేషన్ కన్వీనర్ తేలుకుంట సతీష్ గుప్తా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వినోద్‌తో పాటు ముఖ్యమంత్రి ప్రత్యేక సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. నగరంలో ఎక్కడాలేని విధంగా 200 అడుగుల మేరకు రోడ్డును విస్తరిస్తే, వందలాది మంది ఇళ్లతో పాటు జీవనోపాధిని కోల్పోయి రోడ్డున పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా, ఆధునిక టెక్నాలజీతో తక్కువ స్థల సేకరణతోనే ఎలివేటెడ్ కారిడార్‌లను నిర్మించవచ్చని తెలిపారు. శామీర్‌పేట నుంచి కరీంనగర్‌కు వరకు కేవలం నాలుగు లేన్‌ల రోడ్డు మాత్రమే అందుబాటులో ఉండగా, నగర పరిధిలో మాత్రం 6 లేన్‌లకు విస్తరించడం తగదన్నారు. ఈ నేపథ్యంలో రోడ్డు విస్తరణ కుదించాలంటూ వేం నరేందర్‌రెడ్డి విజ్ఞప్తి చేయగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

అంతర్రాష్ట్ర గంజాయి పెడ్లర్ల అరెస్ట్

4.8 కిలోల గంజాయి స్వాధీనం

సికింద్రాబాద్: ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్న ఇద్దరు పెడ్లర్లను జీఆర్పీ పోలీసులు అరెస్ట్ చేసి వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని జీఆర్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రైల్వే డీఎస్పీ జావెద్ వివరాలు వెల్లడించారు. ఒడిశాలోని గోడపంకకు చెందిన శ్రబన్ నాయక్(, టఫన్ బిషోయ్(బంధువులు. కేరళ రాష్ట్రంలోని క్యాలికట్‌లో పని చేస్తున్న వారు క్రిస్మస్ పండుగ నేపథ్యంలో తమ అమ్మమ్మ ఊరికెళ్లారు. అక్కడ మానాస్ అనే వ్యక్తితో శ్రబన్ నాయక్‌కు పరిచయం ఏర్పడింది. ఒడిశాలోని దాదర్ నుంచి ముంబైకి గంజాయి తరలిస్తే రూ. 10 వేలు ఇస్తానని చెప్పడంతో అందుకు వారు అంగీకరించారు. పథకం ప్రకారం వారు డిసెంబర్ 29న గంజాయిని తీసుకొని కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో ముంబై బయలుదేరారు. మంగళవారం ఉదయం రైలు సికింద్రాబాద్ ప్లాట్ ఫామ్ నెం. 09కు చేరుకుంది. శ్రబన్ నాయక్, టఫన్ బిషోయ్ అనుమానాస్పదంగా తిరుగుతుండటాన్ని గుర్తించిన జీఆర్పీ పోలీసులు వారి బ్యాగులను సోదా చేయగా 4.858 కిలోల గంజాయిని గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

'పాస్టర్స్' సమస్యలపై సీఎంకు వినతి

కంటోన్మెంట్: కంటోన్మెంట్ ప్రాంతంలో పాస్టర్స్ కమ్యూనిటీ కోసం ప్రత్యేకంగా గ్రేవ్ యార్డ్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే శ్రీగణేష్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈ మేరకు మంగళవారం ముఖ్యమంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. త్వరలోనే పాస్టర్స్ కమ్యూనిటీ ప్రతినిధులతో భేటీకి సీఎం అంగీకరించినట్లు పేర్కొన్నారు. కంటోన్మెంట్ పరిధిలో చేపట్టబోయే ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణం, భూసేకరణ బాధితులకు పరిహారంతో పాటు నియోజకవర్గ పరిధిలోని ఇతర సమస్యలపై సీఎంతో చర్చించామన్నారు. దశలవారీగా కంటోన్మెంట్ పరిధిలోని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు.